ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 20 సెప్టెంబరు 2024

వరద బాధితుల సహాయ నిధికి కార్మికుల జీతం 8

జీఎం కార్యాలయాల ఎదుట టీబీజీకేఎస్ ధర్నా 8



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై నజర్

- బీఆర్ఎస్ టిక్కెట్ రేసులో చిరుమళ్ల రాకేష్, దాసరి ఉష
- పార్టీ ఆదేశిస్తే బరిలో నిలవనున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు పలువురు నాయకులు తహతహలాడుతున్నారు. అధిష్టానం టికెట్ ఇస్తే సత్తా చాటాలని చూస్తున్నారు. టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమళ్ల రాకేష్, పార్టీ నాయకురాలు దాసరి ఉష పార్టీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండగా, పార్టీ ఆదేశిస్తే మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి బరి లోకి దిగే అవకాశాలు లేకపోలేదు. కరీంనగర్-మెదక్- ఆదిలాబాద్-నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 2019 మార్చిలో జరగగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన టి జీవన్‌రెడ్డి గెలుపొందారు.

ఆయన పదవీ కాలం 2025 మార్చి 29తో ముగియనున్నది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నది. ఈనెలాఖరు నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రారంభించనున్నారు. గడిచిన ఐదేళ్లలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారితో పాటు, అంతకుముందు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోలేని వాళ్లు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రస్తుతానికి 1,96,321 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,35,218 మంది, మహిళలు 61,077 మంది, థర్డ్ జెండర్ 26 మంది ఉన్నారు. 50వేలకు పైగా కొత్త ఓటర్లు పెరిగే అవకాశాలున్నాయి. గడిచిన ఎన్నికల్లో మొత్తం 17 మంది అభ్యర్థులు పోటీపడ్డారు.

ఈ పట్టభద్రుల స్థానం 15 జిల్లాల్లో విస్తరించి ఉండడంతో ప్రొటోకాల్ ప్రకారం అన్ని జిల్లాల్లో ప్రాధాన్యం లభిస్తుంది. దీంతో పలువురు నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కన్నేశారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో నాలుగు ఏళ్ల ఉండడంతో అప్పటి వరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి తమ అదృష్టాన్ని పరీక్షించు కోవాలని భావిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పార్టీ టికెట్ కోసం యత్నిస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు గెలుపొందగా, పార్లమెంట్ స్థానం నుంచి కూడా కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న తానిపర్తి భానుప్రసాదరావు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో వచ్చే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గురిపెట్టారు.

• ఎవరి ధీమా వారిది..

ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా తెలంగాణ కోసం ఉద్యమించిన టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమళ్ల రాకేష్ పార్టీ టికెట్ రేసులో ఉన్నారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా రాకేష్ ఉంటారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పార్టీ టికెట్ ఆశించినప్పటికీ, సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. ఈసారి పట్టభద్రుల ఎమ్మెల్సీగా టికెట్ కోసం యత్నిస్తున్నారు. ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకుడిగా వ్యవహరించిన రాజేష్‌కు పార్టీలో ఉన్న అందరి నాయకులతో సత్సంబంధాలు ఉండడం, పట్టభద్రులకు సుపరిచితుడే కావడంతో ప్రచారం చేయడం సులువుగానే ఉంటుందని భావిస్తున్నారు.

అలాగే గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసిన విద్యావంతురాలు దాసరి ఉష రాజకీయాల్లో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆయనతో పాటు దాసరి ఉష కూడా బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఆమెను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలంటూ పట్టభద్రుల నుంచి ఒత్తిడి వస్తున్నది. పార్టీ టిక్కెట్ ఇస్తే పోటీచేసేందుకు రెడీగా ఉన్నారు.

వీళ్లే గాకుండా కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా రాష్ట్ర నాయకుడు యాదగిరి శేఖర్‌రావు, డాక్టర్ బీఎన్ రావులు పార్టీ టికెట్ కోసం పోటీపడుతున్నారు. సదరు నాయకులు కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించడంతో పాటు వివిధ వర్గాల పట్టభద్రులను కలిసి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం అల్ఫోర్స్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకుంటే స్వతంత్రంగానైనా పోటీ చేస్తానని ప్రకటించారు. అలాగే వెలిచాల రాజేందర్ రావు సైతం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ నరేందర్‌రెడ్డికి టికెట్ ఖరారు చేస్తే మాత్రం ఆయనకు గట్టి పోటీనిచ్చేందుకు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని బరిలో నిలిపే అవకాశాలున్నాయి. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలు పొందిన ఆయనకు పార్టీలో అందరి నాయకులతో పరిచయంతో పాటు, విద్యా సంస్థలు ఉండడం, ఓటర్లలో చాలా మంది ఆయన విద్యా సంస్థల్లో చదువుకున్న వాళ్లు ఉండడం ఆయనకు కలిసివచ్చే అంశంగా పార్టీ భావిస్తున్నది. అయితే ఇంకా సమయం ఉండడంతో ఇప్పుడే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు లేవని, అంతర్గంగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వవచ్చని తెలుస్తున్నది.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు ఉదయం 9నుంచి 12 గంటల మధ్య ప్రీస్కూల్ కరికులం గురించి, కరదీపిక ప్రియదర్శిని పుస్తకాల ఆవశ్యకత ప్రాముఖ్యత తెలిసేలా సూపర్‌వైజర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీస్కూల్లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూసుకోవాలని, దానికి తగిన విధంగా టీచర్లకు శిక్షణ అందించి బలోపేతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ సమయంలో పిల్లలకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తానని, వారిని దానికి తగిన విధంగా తీర్చిదిద్దుతూ, పిల్లల భవిష్యత్తుకు మంచి పునాదులు వేయాలని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్‌కమోడిటీ పరంగా ఎటువంటి గ్యాప్ లేకుండా ఐసీడీఎస్ సర్వీస్‌లకు ఆటంకం కలగకుండా చూడాలని, దీనికి సంబంధించి గ్యాప్స్‌వస్తే వెంటనే అదనపు కలెక్టర్‌కు లేదా తనకు తెలియజేయాలని సీడీపీవోలను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో వచ్చే గుడ్లు తీసుకునే సమయంలో దాని బరువు ప్రమాణాలు పరిశీలించాలని, ప్రమాణాలు లేని పక్షంలో గుడ్లు తీసుకోవద్దని టీచర్లకు సూచించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సీడీపీవోలు కె కవిత, అలేఖ్య, పుష్పలత, పోషణఅభియాన్ జిల్లా కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

భూ సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

సింగరేణి కింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారంపేటలో 88ఎకరాలు భూసేకరణ చేసి సింగరేణికి అప్పగించాల్సిన అవసరం ఉందని, అక్కడ భూసేకరణకు సంబంధించి రికార్డుల అంశంలో సమస్యలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బుధవారంపేట గ్రామంలో సర్వే నిర్వహించి భూసేకరణ సమస్యలను నెలరోజుల వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని ఆర్డీవో హనుమా నాయక్, సింగరేణి, రెవెన్యూ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 19: పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమార్‌ను గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడే వ్యక్తి మహేష్‌కుమార్‌గౌడ్ అని అన్నారు. మహేష్ కుమార్‌కు పార్టీ కీలక బాధ్యతలను అప్పగించిందని, రాష్ట్రంలో ప్రజలు ఆశించిన విధంగా రేవంత్‌రెడ్డి ప్రజా పాలన కొనసాగుతోందని, పదేళ్ల గడిల పాలన నుంచి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ స్వచ్ఛమైన పాలనను అందిస్తోందన్నారు. ఎన్ఎస్‌యూఐ నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌కుమార్ పార్టీలో సీనియర్ కార్యకర్తగా పని చేశారన్నారు. ప్రజా ప్రతినిధులను, నాయకులను, కార్యకర్తలను సమన్వయ పర్చడంలో అనుభవం ఉన్న వ్యక్తి మహేష్ అని అన్నారు.

'ట్రినిటీ'లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేష్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 19 : పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీనికి ట్రినిటీ డిగ్రీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనడం ఆనందించదగ్గ విషయమన్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణతోనే స్వచ్ఛగ్రామాలుగా రూపుదిద్దుకుంటాయన్నారు. వలంటీర్లు చేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు చేత మొక్కలు నాటించారు. వైస్‌ప్రిన్సిపాల్ నీతారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అశ్విని, సంజీవ్, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ కళాశాలలో స్వచ్ఛతా హి సేవ

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 19:గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వవలంటీర్లు కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రహమాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జీడీ కనకయ్య, లైబ్రేరియన్ శంకరయ్య, సతీష్, ప్రియదర్శిని, శైలజ, రమాదేవి, రామ్మూర్తి, రఫిక్ పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలి

- జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

సుల్తానాబాద్, సెప్టెంబరు 19 : గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్డులకు తరలించాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వీర బుచ్చయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ గ్రామాలలో సానిటేషన్ బాగుండాలని, ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని, అలాగే సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులకు కాకుండా సెగ్రిగేషన్ షెడ్డుకు తీసుకువెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేరుచేయాలని తడిచెత్తతో వర్మికంపోస్ట్ తయారుచేయాలని సూచించారు. గ్రామపంచాయతీలో మూడు మాసాలకు సరిపడా బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉండాలని, నెలలో మూడుసార్లు వాటర్ ట్యాంక్ శుభ్రం చేయాలని, ట్యాంకుల్లో నీరు నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేయాలని గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు కనపడకూడదని తెలిపారు. మొదటిసారి మండల పరిషత్ కార్యాలయంకు వచ్చిన వీర బుచ్చయ్యను ఎండీపీవో, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి దివ్యదర్శన్‌రావు, డీఎల్‌పీవో వేణుగోపాల్, మండల పరిధిలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

- గోదావరిఖనిలో కాంగ్రెస్ రాస్తారోకో - కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 19: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై ఢిల్లీ బీజేపీ నాయకుడు తన్వీందర్ సింగ్ శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌లు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ గురువారం ఆందోళనకు దిగింది. గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రామగుండం మేయర్ అనీల్ కుమార్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి మాట్లాడారు. బీజేపీ, శివసేన నాయకులు రాహుల్ గాంధీ నాలుక చీలుస్తామంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ పార్టీల బెదిరింపులకు భయపడేదిలేదన్నారు. రాహుల్ కుటుంబం దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబమని, భారత్ జోడో యాత్రతో ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారన్నారు. బీజేపీ, శివసేనలు తమ పద్ధతులు మార్చుకోకపోతే కార్యాలయాలను ముట్టడిస్తామన్నారు. రాహుల్‌గాంధీపై వ్యాఖ్యలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బాధ్యత వహించాలని, రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు కాల్వ లింగస్వామి, మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, దీటి బాలరాజు, నాయిని ఓదెలు, బొమ్మక రాజేష్, సాంబమూర్తి గట్ల రమేష్, యాకూబ్, బాల రాజ్‌కుమార్, కౌటం సతీష్, మాలెం మధు, బొంతల లచ్చన్న, గడ్డం శ్రీనివాస్, గఫూర్, దాసరి విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

- ముస్లింల ర్యాలీ.. ఏర్పాట్లను పరిశీలించిన సీపీ



పెద్దపల్లిలో సీపీని సన్మానిస్తున్న ముస్లింలు



గోదావరిఖనిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 19: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలో సీపీ, డీసీపీ చేతన ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఇటీవల శాంతియుత వాతావరణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గణేశ్ నిమజ్జనం కార్యక్రమంలో పోలీసులు సక్సెస్ అయ్యారని, అదేస్ఫూర్తితో మిలాద్ ఉన్ నబీ ర్యాలీలను కూడా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్త్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, పెద్దపెల్లి ఏసీపీ జి కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని తన్‌జీమ్ అహెలే సున్నత్ వల్ జమత్ కమిటీ గౌరవ అధ్యక్షుడు హాజి అలీ అన్నారు. మిలాన్ ఉన్ నబీ సందర్భంగా గురువారం పట్టణంలోని గాంధీనగర్ మదర్సానుంచి ర్యాలీ నిర్వహించారు. కళ్యాణ్‌నగర్ నుంచి రీగల్ షూ మార్ట్ మీదుగా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సోదరభావం, జీవన విధానంపై ప్రవక్తచూపిన మార్గంలో నడవాలని, ప్రవక్త ఒక ముస్లింలకే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారన్నారు. విశ్వ శాంతి కోసం ప్రవక్త పని చేశారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ హుస్సేన్, షహదత్ హుస్సేన్, మౌలానా, మహ్మద్ షరీఫ్, ఉమర్, గులాం స్వాబి, మున్వర్, గౌస్‌బేగ్, మహ్మద్ రఫిక్, నాజీమోద్దీన్, షేక్ అలీ, రియాజ్ బేగ్, హుస్సేన్, ఫయాజ్, అలీ బేగ్ మౌలానా పాల్గొన్నారు.

బీజేపీని బలమైన శక్తిగా నిలిపేందుకు కృషి

- రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి



సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 19: రామగుండం నియోజకవర్గంలో బీజేపీని బలమైన శక్తిగా నిలుపుదామని నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. సభ్యత్వ నమోదుపై గురువారం అసెంబ్లీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసమావేశంలో కందుల సంధ్యారాణి మాట్లాడారు. సభ్యత్వ ప్రాజెక్టును విజయవంతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్న రెండు పర్యాయాలు చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం నాయకులు, కార్యకర్తలపై ఉన్నదని సంధ్యారాణి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీకి పెద్దఎత్తున ఓట్లు వేయడంతో పార్టీకి మరింత ఆదరణ పెరిగిందని, గతంలో కన్నా మరింత ఎక్కువ సభ్యత్వాలు చేసే అవకాశం ఉన్నదని ఆమె అభిప్రాయపడ్డారు. బీజేపీ సభ్యత్వం పెరగడం ద్వారా పథకాలు క్షేత్రస్థాయిలో పేదలకు చేరుతాయని అన్నారు. పార్టీ అభిమానులు, గతంలో పనిచేసిన వారిని, మేధావులు సభ్యత్వం తీసుకునేలా నేరుగా కలవాలని, యువత, మహిళల సభ్యత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంధ్యారాణి నాయకులకు సూచించారు. ఈకార్యక్రమంలో సభ్యత్వ ప్రముఖ్ క్యాతం వెంకటరమణ, నాయకులు కోడూరి రమేష్, గుండబోయిన భూమయ్య, నవీన్‌గౌడ్, పంగ రవి, నరసింహులు, రాజ్‌కుమార్, రంజిత్, మచ్చ విశ్వాస్, ప్రవీణ్, మహేందర్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు అధికారుల సూచనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి



వరిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 19 : వరి పొలాల్లో తెగుళ్ల నివారణకు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని పంట పొలాలను వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంట పొలాల్లో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగుళ్లు ఆశించిందని తెలుపడంతో వారికి జిల్లా అధికారి ఆదిరెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అధిక గాలులు, వర్షాలు పడటం ద్వారా వరి పంట పసుపు రంగు మారడంతోపాటు, కొసల నుంచి తెల్లటి చారలు గమనించినట్లు, ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందవద్దన్నారు. తెగుళ్ల లక్షణాలు తొలిదశలో గుర్తిస్తే నత్రజని తాత్కాలికంగా ఆపాలని, పంట అంకుర దశకు చేరని పొలాల్లో పై పాటుగా నత్రజని, పొటాష్ ఎరువును వేసుకోవాలన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు వ్యాప్తిని నివారించేందుకు కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు దీంతో పాటు స్టెప్టోమైసిన్ సల్ఫేట్ 60 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. అయినా కూడా తగ్గకపోతే రెండో దఫాగా హెక్సాకోనజోల్, ప్లాంటోమైసిన్‌లు కలిపి పిచికారి చేయాలన్నారు. ఆఖరి దశగా పోటాష్ ఎరువులను వేయాలన్నారు. వారి వెంట సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనాథ్, మండల వ్యవసాయాధికారి అలివేణి, ఏఈవోలు వినయ్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

తెగుళ్లను నిర్లక్ష్యం చేయవద్దు..

జూలపల్లి, సెప్టెంబరు 19 : వరిపొలాల్లో వస్తున్న తెగుళ్ల ను రైతులు ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రత్యూష అన్నారు. మండలంలోని కాచాపూర్‌లో గురువారం బ్యాక్టీరియా బారినపడిన ఎండాకు తెగుళ్లు సోకిన రైతుల పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్‌తో కలిసి ఏవో ప్రత్యూష పరిశీలించారు. తెగుల్ల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.

సెలవులో రామగుండం కమిషనర్..

కోల్‌సిటీ, సెప్టెంబరు 19: రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సెలవులో వెళ్లారు. వారంరోజుల పాటు సెలవు పెట్టారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా సూపరింటెండెంట్ ఇంజనీర్ శివానంద్‌కు బాధ్యతలు ఇచ్చారు. గురువారం శివానంద్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాంత్ వారం రోజుల తరువాత విధుల్లో చేరుతారా, సెలవును పొడిగిస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జ్వరంతో మహిళ మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 19: చిగురుమామిడికి చెందిన సిరవేణి శిరీష (30) అనే మహిళ గురువారం జ్వరంతో మృతి చెందింది. శిరీష వారం రోజు లుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా చికిత్స తీసుకున్న ప్పటికీ తగ్గలేదు. గురువారం తీవ్ర జ్వరంతో అపస్మారక స్థితికి చేరింది. కుటుంబ సభ్యులు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. వైద్యులు శిరీషను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. త న కూతురు జ్వరంతోనే మృతి చెందిందని తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బండి రాజేశ్ తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రిలో రోగి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపల్లి రోడ్డు లో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స కోసం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకవెళ్లిన రోగి మృతి చెందిన సంఘటన గురువారం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆపరేషన్ గదిలో రోగి మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. మల్యాల మండల కేంద్రానికి చెందిన వంగల మహిత (38) మూడు రోజుల క్రితం గర్భసంచి నొప్పితో ఆసుపత్రిలో చేరింది. ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించాలని వైద్యులు నిర్ణయించారు. శస్త్ర చికిత్స కోసం మత్తు ఇంజక్షన్ ఇవ్వగానే మహిళ గుండెపోటుకు గురై మృతి చెందిందని బంధు వులకు వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిత మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఐఎంఏ నేతలు ఆసుపత్రికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కు టుంబానికిన్యాయం చేస్తామని ఆసుపత్రి నిర్వాహకులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది. కాగా మృతురాలు మహితకు భర్త రమేశ్, కూతురు మైథిలి, కుమారుడు సాయి ఉన్నారు.

దాడికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంట, సెప్టెంబరు 19: జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చెందిన పెరుగు శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పెరుగు శ్రీనివా స్-సుజాత దంప తుల కుమార్తెకు గత నెల నిశ్చితార్థం జరిగింది. శ్రీని వాస్ ఈ నెల 18న గ్రామంలోని చికెన్ సెంటర్ వద్ద కూర్చోని ఉన్నాడు. అదే సమయంలో అక్కడికి మద్యం సేవించి వచ్చిన పెరుగు సిజిత్ తన ను నిశ్చితార్థానికి పిలువ లేదంటూ గొడువకు దిగాడు. పక్కనే ఉన్న కర్ర తీసుకోని శ్రీనివాస్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. శ్రీనివాస్ భా ర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు.

ధరణి ఆపరేటర్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

శంకరపట్నం, సెప్టెంబరు 19: గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి పత్రాలు ఇవ్వడం లేదని ధరణి ఆపరేటర్‌పై గురువారం కరీంపేటకు చెం దిన మేడిశెట్టి బక్కవ్వ కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కరీంపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి బక్కవ్వ వ్యవసాయ భూమిని ఆమె కోడళ్లు మేడిశెట్టి రాజమ్మ, మేడిశెట్టి స్వరూప, మనుమడు మేడిశెట్టి రాకేష్, మనమరాళ్లు స్వప్న, రజిత, స్రవంతి, వనమల పేరిట చేసేందుకు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం ఇటీవల ఓ ప్రైవేట్ వ్యక్తి వద్ద స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ తేదీ ప్రకారం తహసీల్దార్ కార్యాలయంలో వీరు పేరు మీద బక్కవ్వ పేరు నుంచి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ తహసీల్దార్ భాస్కర్ చేశారు. అదేరోజు సాయంత్రం డాక్యుమెంట్లు ఇవ్వకుండా సాంకేతిక కార ణాలు ఉన్నాయని చెప్పారు. అనంతర పలుమార్లు తహసీల్దార్ కార్యాల యానికి వచ్చినా సిబ్బంది ఇవ్వడం లేదని చెప్పారు. తహసీ ల్దార్‌ను కలిసి డాక్యుమెంట్లు ప్రైవేట్ వ్యక్తి వద్ద ధరణి ఆపరేటర్ మా మూళ్ల కోసం దాచి పెట్టాడని, ఇప్పించాలని వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ ధరణి ఆపరేటర్‌ను పిలిపించి డాక్యుమెంట్లను వారికి ఇప్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇల్లందకుంట, సెప్టెంబరు 19: మండలంలోని సిరిసేడు గ్రామ శివారు లో గురువారం ఓ యువకుడు బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తలకు గా యమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన కన్నూరి రమేశ్‌కు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడైన కన్నూరి ప్రభంజన్ (21) గురువారం తన వ్యక్తిగత పని మీద జమ్మికుం టకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామ శివారులో తన బైక్ అదుపు తప్పి కింద పడగా తలకు తీవ్రగా యమై మృతి చెందాడు. ప్రభంజన్ తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు.

గంభీరావుపేటలో అగ్ని ప్రమాదం

- ఇల్లు, కిరాణషాపు దగ్ధం - భారీగా ఆస్తి నష్టం

గంభీరావుపేట, సెప్టెంబరు 19: గంభీరావుపేట మండల కేంద్రంలోని మేయిన్‌రోడ్‌లో బచ్చు కృష్ణమూర్తి ఇంట్లో, కిరాణ షాపులో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. కృష్ణమూర్తి కుటుంబం మూడు రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న వారి సమీప బంధువుల వద్దకు వెళ్లారు. ఉన్నట్టుండి గురువారం రాత్రి కృష్ణమూర్తి ఇంట్లో మంటలు చెలరే గాయి. సమీప ప్రజలు మంటలను గుర్తించి, పోలీస్‌లకు, ఇంటి వారికి సమాచారం ఇచ్చారు. ఇంటికి, కిరణా షాపునకు తాళాలు వేసి ఉండటంతో మంటలు ఆర్పడం కొంత కష్టమైంది. దీంతో కిరాణషాపు షెట్టర్లను పగుల గొట్టి లోనికి ప్రవేశించి, స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. మంటలు మరింత చెలరేగడంతో ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. అప్పటికే కిరాణషాపులోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లోని ఫ్రిడ్జ్, బీరువా, ఫ్యాన్లు, మంచాలు, కుర్చీలు, విలువైన పరికరాలు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో, పక్క ఇంట్లో కూడా గ్యాస్ సిలిండర్లు ఉండటంతో సమీప ప్రజలు భయందోళనలకు గురయ్యారు. సిలిండర్ల వద్దకు మంటలు వ్యాపించకుండా యువకులు సాహసంతో సిలిండర్లను బయటకు తెచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చాక మిగిలిన మంట లను సిబ్బంది ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు బావిస్తున్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మంటలను ఆర్పే సహాయక చర్యల్లో పాల్గొన్న యువకులను గ్రామస్తులు అభినందించారు. స్థానిక ఎస్‌ఐ రాంమోహన్, పలువురు నాయకులు, యువకులు, పోలీస్ సిబ్బంది వచ్చి, మంటలను ఆర్పే వరకు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

సీడ్ ఆర్గనైజర్ నుంచి డబ్బులు ఇప్పించాలి

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని చెల్పూర్ గ్రామా నికి చెందిన ఇరుమల్ల సురేందర్‌రెడ్డి తనకు సీడ్ ఆర్గనైజర్ దగ్గర నుంచి డబ్బులు ఇప్పించాని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకున్న ఆరు ఎకరాల భూమిలో శ్రీజ కంపెనీకి చెందిన ఆర్గనైజర్ చిన్నపాప య్యపల్లి గ్రామానికి చెందిన గిసిడి కొండల్‌రెడ్డి, మరో ఆర్గనైజర్ సంతోష్ అనే వ్యక్తులు ఎకరానికి లక్ష 20 వేల రూపాయల దిగుబడి వస్తుందని ఆశ చూపి సీడ్ సాగు చేయించారని చెప్పాడు. పంట సాగు చేస్తున్న క్రమంలో పరిశీ లనకు రమ్మని ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించలేదని తెలిపాడు. పురుగు ఉధృతిని తగ్గించేందుకు పలుమార్లు మందు స్ప్రే చేయడంతో దిగు బడి తగ్గిందని వాపోయాడు. ఒప్పందం ప్రకారం డబ్బు లు ఇస్తామని చెప్పి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పాడు. తనకు తెలి యకు ండానే తన ఖాతాకు 4 లక్షల 75 వేల నగదును పంపించారని చెప్పాడు. మిగతా 2 లక్షల 45 వేల రూపాయల కోసం ఆర్గనైజర్స్ ఇంటికి వెళ్తే స్పందించడం లేదని తెలిపాడు. తన ఖాతాకు వచ్చిన డబ్బులకు చెక్కు ఇచ్చానని అన్నాడు. గ్రామంలో మరో 50 మం ది రైతులను ఇలానే మోసం చేశారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

వృద్ధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: విశిష్ట సేవలు అందించిన వయో వృద్ధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీ య వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవలు అందించడంలో నిమగ్నమైన అర్హతల కలిగిన సంస్థలకు, సంస్థల ప్రతినిధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందించన్నుట్లు తెలిపారు. ఈనెల 25లోపు హైదరాబాద్‌లోని వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం మలక్‌పేట నందు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 9652394751, 040-245590480 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

23నుంచి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య కబడ్డీ పోటీలను ఈనెల 23,24 తేదిల్లో ప్రభుత్వ ఉన్నత పాఠ శాల హుజూరాబాద్ మైదానంలో నిర్వహించనున్నారని జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. 23న అండర్ 17 బాల బాలికలకు, 24న అండర్ 14 బాలబాలికలకు కబడ్డీ పోటీలను హుజూరాబాద్ మం డల కన్వీనర్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, నిర్వహణ కార్యదర్శి పిడి సొల్లు సారయ్యల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లా లోని 16 మండలాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొ న్నారు. ఎంపికైన వివిధ మండలాల క్రీడాకారులు మండల కన్వీనర్ కార్యదర్శుల సంతకంతో కూడిన అర్హత ధ్రువపత్రాలతో నిర్వహకులకు ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీ లలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను త్వరలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు సొల్లు సార య్య 9391739736 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న అధికారులు

భగత్‌నగర్, సెప్టెంబరు 19 : కరీంనగర్ రీజియన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం త్రైమాసిక అవార్డులను అధికారులు అందించారు. గురువారం కరీంనగర్‌లోని డాక్టర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో రీజినల్ మేనేజర్ సుచరిత ఆధ్వర్యంలో అవార్డులను అందించారు. వివిధ కేటగిరీలకు చెందిన 28మంది ఉద్యోగులను నగదు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ రీజియన్‌ను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలుపుటకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిపో మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

జ్యోతినగర్, సెప్టెంబరు 19 : ఆర్ఎఫ్‌సీఎల్ సమీపంలో 2023 ఫిబ్రవరి 18న కొయ్యాడ వెంకన్నగౌడ్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో గోదావరిఖనికి చెందిన ఎస్.కె.సమీర్(19), సయ్యద్ వాజీద్(25)లకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసులు గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్కలపల్లిగేట్ నుంచి ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంటు సమీపంలోని అయ్యప్పగుడి ఎదురుగా ఉన్న కల్లు దుకాణంకు సమీర్, వాజీద్ తరచూ వచ్చి బీర్లు తాగేవారు. అయితే ఇక్కడ మద్యం తాగవద్దని వెంకన్నగౌడ్ ఆ ఇద్దరు వ్యక్తులను వారించాడు. దీంతో కోపం తెచ్చుకున్న సమీర్, వాజీద్‌లు కత్తితో వెంకన్నగౌడ్‌పై దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి గాయపరిచారు. బాధితుడి కొడుకు సుధాకర్ ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ జీవన్ ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు ట్రయల్‌లో భాగంగా ప్రస్తుత ఎన్టీపీసీ ఎస్ఐ సతీష్ సాక్షులను అదనపు పీపీ ఆకుల రాములు ఆధ్వర్యంలో కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి బి.శ్రీనివాసులు ఇద్దరు నిందితులను దోషులుగా తేల్చారు. సమీర్, వాజీద్‌లకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా 6 నెలలు జైలుశిక్ష విధించారు. సాక్షులను ప్రవేశపెట్టడంలో సహకరించిన కోర్టు కానిస్టేబుల్ బుర్ర శ్రీనివాస్, హోంగార్డు పూరెల్ల శ్రీనివాస్‌లను రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ సతీష్ అభినందించారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. 4,140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 10,940 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 2,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 550 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, అల్లీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసె క్కులు విడుదల అవుతుండగా 709 క్యూసె క్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్ప టివరకు ప్రాజెక్టులోకి 185.742 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

ఎన్టీపీసీలో వ్యాపారి ఇంట్లో చోరీ

- 9 తులాల బంగారు నగలు, కిలో వెండి, రూ 1.50 లక్షల నగదు అపహరణ



దొంగలు విరగ్గొట్టిన తలుపు గడియ.. చోరీ జరిగిన ఇంట్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

జ్యోతినగర్, సెప్టెంబరు 19 : గోదావరిఖని ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో తులసి హరిప్రసాద్ రావు(అబ్బులు) అనే వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి తలుపు గడియను విరగ్గొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ఇంట్లో ఉన్న తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, కిలోవెండి, 1,50,000 రూపాయల నగదు, 25 ఖరీదైన చీరలను అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16న అనారోగ్యంతో ఉన్న బంధువులను చూసేందుకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హరిప్రసాద్‌రావు సూర్యా పేటకు వెళ్లాడు. గురువారం తిరిగి ఇంటికి వచ్చిన హరిప్రసాద్‌రావు చోరీ జరిగిన విషయం గుర్తించి ఎన్టీ పీసీ పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ ఎస్ఐ సతీస్, పోలీసులు, సీసీఎస్ పోలీసులు దేవేందర్‌గౌడ్ (హెచ్‌సీ), రాజమౌళి (పీసీ)లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కమిషనరేట్‌కు చెందిన డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను తనిఖీ చేశారు. ఫింగర్ ప్రింట్ బృందం చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరించింది. అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగినట్లు తెలుస్తున్నది. బీరువా డోర్‌ను పగులగొట్టి అందులో ఉన్న నగలు, నగదు, చీరలను ఎత్తుకెళ్లినట్టు తెలు స్తున్నది. ఇంటి యజమాని హరిప్రసాద్ కుందనపల్లిలో పెట్రోల్‌బంక్ నడుపుతు నాడు. కృష్ణానగర్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమా చారం. ఎన్టీపీసీ, సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్సారెస్పీ కెనాల్‌కు పడిన గండి (ఫైల్)

పరిహారం.. పరిహాసం

- 2016లో ఎస్సారెస్పీ కెనాల్‌కు గండి
- నీట మునిగిన వందలాది ఎకరాల్లోని పంటలు
- పరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు

మల్యాల, సెప్టెంబరు 19 : ఎస్సారెస్పీ కెనాల్ తెగి కాలువ నీరు పంటలను ముంచెత్తింది. పొలాల్లో ఇసుక మేటలు వేసింది.. ఇళ్లన్నీ జలమయం అయ్యాయి.. మంత్రులు, అధికారులు, ఆఖరికి కేంద్రం నుంచి బృందం కూడా వచ్చి అయ్యో పాపం అంది.. పరిహారం ఇస్తాం.. ఆదుకుంటాం అన్నారు. ఇదంతా ఎనిమిదేళ్ల క్రితం మాట... అయినా ఇప్పటికీ పరిహారం జాడలేదు. వివరాల లోకి వెళ్తే.. మల్యాల మండలం మానాల శివారులో గల ఎస్సారెస్పీ కాకతీయ కాలువ డి-65 వద్ద 2016 సెప్టెంబరు 20న గండి పడి సమీప దమ్మక్క చెరువు, మ్యాడంపెల్లిలోని చెరువులు నిండి పంట పొలాలను ముంచెత్తాయి. మ్యాడంపెల్లిలో ఇళ్ల నుంచి వరద వెళ్లగా ఇళ్లన్నీ జలమయం అయ్యాయి. బాధితులు రెండు రోజుల పాటు ఇళ్లు ఖాళీ చేశారు. వందకు పైగా ఇళ్లకు నష్టం జరిగితే 28 ఇళ్లకు మాత్రమే నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఇక వందలాది ఎకరాల పంటలకు నష్టం వాటిల్లగా పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. అప్పటి రాష్ట్రమంత్రులు ఈటల రాజేందర్, హరీష్‌రావులు వచ్చి రైతులను ఓదా ర్చారు. ఆదుకుంటామన్నారు. అనంతరం 2016 నవంబర్ 13న కేంద్ర బృందం కూడా వచ్చి రైతుల నుంచి నష్టం వివరాలు తెలుసుకున్నారు.

● నష్టం వివరాలు ఇవి

ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్‌కు గండి పడటంతో నష్టం వాటిల్లిన పంటలపై రెవెన్యూ వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదిక రూపొందించి పంపించారు. మానాల గ్రామ పరిధిలో 16 మందికి చెందిన 274 హెక్టార్లలో వరి, 0.40 హెక్టార్లలో ముగ్గురు రైతులకు చెందిన మొక్కజొన్న, 30 మందికి చెందిన 7.49 హెక్టార్ల పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. మ్యాడంపెల్లి పరిధిలో 40 మందికి చెందిన 7.23 హెక్టార్లలో వరి, నలుగురికి చెందిన 0.48 హెక్టార్లలో మొక్కజొన్న, ఒక్క రైతు 0.27 హెక్టార్ల పత్తి, ఏడుగురు రైతుల 2.24 హెక్టార్లలో కంది, 69 మంది రైతుల 14.06 హెక్టార్ల భూముల్లో ఇసుక మేటలు వేసిందని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

● కేంద్రం పరిహారం అందించకపోవడానికి కారణం అదేనా?

కేంద్ర ప్రభుత్వ బృందం పర్యటించిన ప్రతి చోట పరిహారం రావడం తప్పనిసరి. కానీ ఇక్కడ మాత్రం రాకపోవడానికి అనేక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. మానాల శివారులో కెనాల్ తెగకముందే రెండేళ్ల క్రితం గండి పడి సిమెంట్ సంచులతో తాత్కాలిక మరమ్మతులు చేశారని కేంద్రబృందం దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఇది మానవ తప్పిదంగా పరిగణించే కేంద్రం పరిహారం ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. ప్రకృతి విపత్తులకు అందించే పరిహారం అప్పటి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంగా తెగిన కాలువకు అందించలేమని చెప్పినట్లు పలువురు పేర్కొంటున్నారు.

పంటలు మొత్తం నీట మునిగాయి



కెనాల్ కాలువ తెగడంతో తమ భూముల నుంచి నీరు ప్రవహించి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తమ మామిడి తోటతో పాటు అయిదు ఎకరాల కంది పంటలు నీటిలో మునిగి పోయాయి. అధికారులు వచ్చి పలుమార్లు సర్వే చేశారు. నివేదికలు తయారు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసు కెళ్లినా దీనిపై పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం పరి హారం అందించాలి.

- రాజేందర్, రైతు, మ్యాడంపల్లి

సాగుకు రెండేళ్లు పట్టింది



తనకున్న భూమితో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేసాను. కాలువకు గండి పడి నీరంతా తమ పొలం నుంచే వెళ్లింది. ఇసుక మేటలు వేసింది. గండ్లు పడి వ్యవసాయం చేసుకునే విధంగా లేకుండా పోయింది. దీంతో రెండేళ్లు చదును చేయడానికే పట్టింది. అప్పుడు పంట నీటిలో కొట్టుకు పోయి నష్టం జరుగగా చదును చేయడం, రెండేళ్ల పాటు పంట వేయక పోవడంతో మరింత అప్పులు చేయాల్సి వచ్చింది.

- రాజయ్య, రైతు, మానాల

దుబాయిలో గంభీరావుపేట వాసి మృతి

- వెళ్లిన కొద్ది రోజులకే విషాదం ● కన్నీరు మున్నీరవుతున్న భార్యాపిల్లలు ● మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని వేడుకోలు

గంభీరావుపేట, సెప్టెంబరు 19: బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన ఓ వ్యక్తి వెళ్లిన కొద్ది రోజులకే ఫిట్స్‌తో మృతి చెందిన ఘటన ఆ కుటుంబాన్ని కలిచివేస్తోంది. గంభీరావుపేటకు చెందిన కరువారి దేవయ్య (46) అనే వ్యక్తి గత నెల 19న లక్షా రూపాయల వరకు అప్పుచేసి ఓ కంపెనీ వీసాపై దుబాయి వెళ్లాడు. వెళ్లిన రెండు రోజుల్లో దేవయ్య పనిలో చేరాడు. పనిలో చేరిన మరునటి రోజే దేవయ్య తన రూంలో ఉండగా ఫిట్స్ వచ్చింది. దీంతో దేవయ్యను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గత నెల 27న మృతి చెందాడు. గల్ఫ్‌లో దేవయ్య మృతి చెంది దాదాపు 22 రోజులు గడిచి పోయాయి. దేవయ్య ఫిట్స్‌తో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం కుటుంబీకులకు ఆలస్యంగా తెలిసింది. దేవయ్య నుంచి ఫోన్ రాకపోవడం, ఇక్కడి నుంచి ఫోన్ కలవకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. దుబాయిలో తెలిసిన వారి నుంచి దేవయ్య మృతి చెందాడని ఫోన్ రావడంతో భార్యాపిల్లలు రోదనలు మిన్నంటాయి. మృతి చెంది 22 రోజులు గడిచినా ఇంటికి దేవయ్య మృతదేహం రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. దేవయ్య మృతదేహాన్ని అక్కడి ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారాని సమాచారం అందింది. కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో దేవయ్య మృతదేహం స్వదేశానికి రావడం ఆలస్యం అవుతోందని మృతుడి బంధువులు తెలిపారు. దుబాయిలో కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి తన భర్త దేవయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని భార్య శ్యామల వేడుకుంటున్నారు.



దేవయ్య(ఫైల్)



దేవయ్య మృతదేహాన్ని తెప్పించాలని వేడుకుంటున్న దేవయ్య భార్యాపిల్లలు

ప్రపంచ దేశాల్లో శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నది భారతీయులే

● తహసీల్దార్ కిషన్

కోరుట్ల, సెప్టెంబరు 19 : ప్రపంచ దేశాలలో భారతీయులు శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని తహసీల్దార్ కిషన్ అన్నారు. పట్టణంలోని శిశు మందిర్‌లో సిద్దిపేట, జగిత్యాల, కరీంనగర్, రాజ న్న సిరిసిల్ల విభాగ్‌స్థాయి గణిత విజ్ఞాన మేళాను ఆర్ఎస్ఎస్ గ్రామీణ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జిన్నా సత్యనారాయణతో కలిసి తహసీల్దార్ కిషన్ ప్రారంభించారు. గణత విజ్ఞాన మేళా కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించిన సరస్వతి శిశుమందిర్‌ల నిర్వాహకులు గణతంలో వివిధ మెలకువలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తహ సీల్దార్ కిషన్, ఆర్ఎస్ఎస్ గ్రామీణ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జిన్న సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు గణితంలో శ్రద్ధ వహించి చదువుతే ఉన్నత ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు. విద్యార్థులకు శిశుమందిర్ విద్యా ఎంతో క్రమశిక్షణను నేర్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం, డాక్టర్ రవికిరణ్, పాఠశాల కరస్పా డెంట్ నీలి శ్రీనివాస్, డైరెక్టర్లు మనోజు కుమార్, శివప్రసాద్, చంద్రమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన వక్తలు

ముచ్చటిస్తూ.. సమస్యలను తెలుసుకుంటూ..

- ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 : మండలంలోని దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. దుమాలలో దాదాపు మూడు గంటలపాటు పర్యటించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, బోధన విధానం తదితర అంశాలపై ఆరా తీశారు. తరగతి గదుల్లోకి నేరుగా వెళ్లి పిల్లలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన చిత్రలేఖనం గదిని ప్రారంభించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను తిలకించారు. సాధించిన అవార్డులను విద్యార్థులు, ఉపాధ్యాయులు వివరించారు. సంగీతం గదికి వెళ్లారు. విద్యార్థులు కింద కూర్చొని ఉండడంతో ఆయన వారితో పాటే కింద కూర్చొని సంగీతం విన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని ఉపాధ్యాయులు పరిచయం చేయడంతో మంత్రి సంజయ్‌కుమార్ మొదటి పల్లవి పాడాలని కోరారు. దాంతో విద్యార్థిని 'పలుకె బంగారమాయేనా.. కోదండ పాణీ' అంటూ పాడడంతో మంత్రి సంజయ్‌కుమార్ లీనమయ్యారు. విద్యార్థినిని అభినందించి మనమంతా ఇలాంటి పాటలే పాడాలని సూచించారు. అనంతరం మంత్రి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. గిరిజన, ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆశించిన ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్నాయో..? లేదో పరిశీలించాలనే పీఎం నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని మరిమడ్ల, దుమాలలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలలను సందర్శించామని వెల్లడించారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా సమస్యలను గుర్తించామని పేర్కొన్నారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పించి మెరుగైన విద్య అందించేందుకు పాటు పడుతామని అన్నారు.

● పిల్లలూ పెద్దయ్యాక ఏమవుతారు..?

దుమాల ఏకలవ్య ఆదర్శ పాఠశాల తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో బండి సంజయ్ మాట్లాడారు. ఏం తల్లీ నీ పేరే మీటి..? అంటూ ప్రశ్నించారు. బాగున్నారా..? నేనెవరినో గుర్తు పట్టారా..? ఎలా చదువుతున్నారని కుశల ప్రశ్నలు వేశారు. సార్ మేం బాగున్నాం.. మీరేలా ఉన్నారూ.. అని పేర్కొన్నారు. సారూ.. మీరు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కదా..! అని చెప్పడంతో గుర్తున్నానులే అంటూ సమాధానమిచ్చారు. పిల్లలు పెద్దయ్యాక మీరేం అవుతారని ప్రశ్నించడంతో ఓ విద్యార్థిని ఐపీఎస్, మరో విద్యార్థిని ఐఏఎస్ అని పేర్కొనడంతో మంత్రి సంజయ్‌కుమార్ శభాష్ అంటూ అభినందించారు. ఆ దిశగా మీరు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పీఎం నరేంద్రమోదీ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి ఆధునిక విద్యను అందిస్తోందని మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్, ఏకలవ్య పాఠశాలల ఆర్‌సీవో జానునాయక్, డీఈవో రమేశ్ కుమార్, ప్రత్యేక అధికారులు భారతి, రాందాస్, ప్రిన్సిపాల్ మంజిద్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల గ్రామంలో గల ఏకలవ్య గురుకుల పాఠశాలను బండి సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగారాగా అధికారులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రికి విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలికారు. అనంతరం గురుకుల పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మనోభావాలు ఎలా ఉన్నాయి? ఎవరు స్పోర్ట్స్‌పై దృష్టిపెట్టారు. చదువులో ఎలా దృష్టి పెట్టారు అనే అంశంపై ఒక్కొక్క విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులను పాఠశాలల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టాయిలెట్ల నిర్మాణం కోసం మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీఈవో రమేష్, ప్రత్యేక అధికారులు లక్ష్మీరాజం, భారతి, రాందాస్, ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రిన్సిపాల్ ఆర్ఎస్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నేత చెన్నమనేని వికాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



దుమాలలో కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్‌కు చిత్ర పటాన్ని అందజేస్తున్న విద్యార్థినులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి

మల్లాపూర్, సెప్టెంబరు, 19 : మండలంలోని కుస్తాపూర్ శివారులో మక్క తోట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెతో జెల్ల పెద్ద ముత్తన్న(60)అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొండ సాయన్న అనే రైతు తన మక్కచేను రక్షణ విద్యుత్‌తో కంచె ఏర్పాటు చేసుకోవడంతోనే పెద్ద ముత్తన్న మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొండ సాయన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జెల్ల పెద్దముత్తన్న ఎరువులు చల్లేందుకు తన పొలం వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ తిరిగి ఇంటికి రాకపోగా కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. కాగా గొండ సాయన్న తన మక్క చేను రక్షణకు అమర్చుకున్న ఇనుప కంచె వద్ద పెద్దముత్తన్న విగత జీవిగా పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. విద్యుదాఘాతంతో శరీరం కమిలిపోయి ఉన్నట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా జరిపి పోస్ట్‌మార్టంకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భూ వివాదాలతో వ్యక్తి దారుణ హత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 19 : భూ వివాదాల విషయమై ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన పెద్దపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డ్ కార్మికుడు కలవేన రాజయ్య(68)కు, అతడి బంధువులకు మధ్య కొంతకాలంగా భూముల విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. గురువారం రోజూమాదిరిగా రాజేశం ఇంటి నుంచి పొలం వద్దకు వెళుతుండగా కొత్తపల్లి-కొలనూర్ గ్రామ శివారులో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి హతమార్చారు. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు మాజీ ఎంపీటీసీ సాయి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఒకరి గల్లంతు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో గురువారం ఒకరు గల్లంతయ్యారు. సుమారు 24 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి చెరువులోకి ఈత కోసం వెళ్లి బయటకు రాకపోవడాన్ని స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి పట్టణ పోలీసులు చేరుకుని జాలర్లతో గాలింపు చేపట్టారు. రాత్రి కావడంతో ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మంథనిరూరల్, సెప్టెంబరు 19: మండలంలోని నాగారం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేయగా మినీ డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్ అప్పగించినట్లు తెలిపారు. వ్యాన్‌యాజమాని, డ్రైవర్, ఇతర కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న విలువ 2.78 లక్షల విలువ ఉంటుందన్నారు.

సైదాపూర్, సెప్టెంబరు 19: సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. సమాచారం ప్రకారం ఎలబోతారంలో తనిఖీ చేయగా ఓ ఇంటిలో అక్రమంగా నిలువ ఉంచిన ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం నిలువ ఉంచిన బత్తు భిక్షపతి, బత్తుల రాజయ్య, స్వామిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బాలుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 : మండల కేంద్రానికి చెందిన వైభవ్ అనే బాలుడు కుక్కల దాడిలో గురువారం తీవ్ర గాయాలపాలయ్యాడు. బాలుడిని తల్లిదండ్రులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైభవ్ ఇంటి ఎదుట ఆడుకుంటున్న క్రమంలో కుక్కలు దాడి చేశాయి. అక్కడే ఉన్న బాలుడి తల్లిదండ్రులు కుక్కలను తరమడంతో అవి అక్కడ నుంచి పారిపోయాయి. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమైందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

చందుర్తి. సెప్టెంబర్ 19 : చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండల కేంద్రానికి చెందిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తికి చెందిన చేట్టిపెల్లి రవి అనే యువకుడు గురువారం తన ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి చందుర్తికి వస్తున్నాడు. కోరుట్ల నుంచి వేములవాడకు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఎదురెదురుగా మర్రిగడ్డలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రవి ఎడమ కాలుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఆసుపత్రికి తతరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టినట్లు ఏఎస్సై బాపు తెలిపారు.

ముగ్గురిపై అదనపు వరకట్నం కేసు

జమ్మికుంట, సెప్టెంబరు 19 : అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన ఎండి సమీనాకు, అదే గ్రామానికి చెందిన సమీర్‌కు పది నెలల క్రితం వివాహం జరిగింది. నెల రోజుల పాటు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కావాలంటూ భర్త వేధిస్తున్నాడు. దీంతో తల్లిగారి ఇంటికి వచ్చిన సమీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త సమీర్, మామ గఫార్, అత్త కమర్‌లు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా పోగొట్టుకున్న 25మంది బాధితుల మొబైల్ ఫోన్లను కరీంనగర్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ పోలీసులు సీఈఐఆర్ విధానం ద్వారా పట్టుకుని గురువారం బాధితులకు సీఐ రమేష్ చేతుల మీదుగా అప్పగించారు. 1,035మంది మొబైల్ ఫోన్‌లను గుర్తించి బాధ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ సీఐ రమేష్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోల్‌సిటీటౌన్ : స్థానిక 11వ డివిజన్‌లో రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అర్హత పత్రాలను గురువారం లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పెద్దెల్లి తేజస్వి ప్రకాష్ పత్రాలను అందజేశారు. నాయకులు పెద్దెల్లి ప్రకాష్, ఆర్‌పీ సరోజన, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : రామగుండం తహసీల్దార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారిందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య ఒక ప్రకటనలో ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆర్‌ఐ స్థాయి అధికారి విచారణ జరిపి రిపోర్టు ఇవ్వడానికి బదులు ఎలాంటి హోదా లేని ఒకరిద్దరు వ్యక్తులను పంపిస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని రఝీకాలనికి చెందిన మొహమ్మద్ ఇబ్రహిమ్(38)గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు కన్నాల టోల్ ప్లాజా వద్ద టిఫిన్ సెంటర్ నడిపేవాడు. కాంగ్రెస్ పార్టీలో చురుకైన సీనియర్ నాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. సమాచారం తెలుసుకున్న పలువురు పార్టీలకు అతీతంగా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని బసంత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సీడీపీవో అలేఖ్య పటేల్ తనిఖీ చేశారు. టీచర్‌తోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆయాకు సైతం సీడీపీవో మెమో జారీ చేశారు.

పాలకుర్తి : మండలంలోని కుక్కలగూడూరు, పుట్నూరు రహదారిపై కారు అదుపు తప్పి బోల్తా పడింది. పుట్నూరు వైపు వెళ్తున్న కారు రోడ్డుపక్కన చెట్టును ఢీకొని బోల్తా కొట్టింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఎలిగేడు : మండలంలోని ముప్పిరితోటలో వార్డు వైజుగా ఓటర్ లిస్ట్‌లో తప్పులు జరిగాయని అదే గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘం నాయకుడు జల్లి రమేష్ గురువారం ఎంపీడీవో భాస్కర్‌రావుకు ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేల కావాలని బీఎల్‌వోలు తప్పులు చేశారని, 10వార్డుల కుటుంబాల వారీగా ఓటర్ లిస్ట్‌లో నమోదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని అప్పన్నపేట, మూలసాల గ్రామాలకు చెందిన పుట్ట రాజేశ్వరి, ముష్కే విజ్ఞులు ప్రమాదవశాత్తు కాళ్లు కోల్పోగా గురువారం ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ ఆదేశాల మేరకు భగవాన్ మహవీర్ సేవ సంస్థాన్ సహకారంతో ఇరువురికి కృత్రిమ కాళ్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సభ్యులు కీర్తి నాగార్జున, జాగిరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మండలంలోని రేగడిమద్దికుంటలో ఇటీవల మృతిచెందిన అన్నెడి మహిపాల్‌రెడ్డి కుటుంబాన్ని గురువారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు, వారి కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట గడ్డం మహిపాల్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, నోముల శ్రీనివాస్‌రెడ్డి, బుర్ర కుమార్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : శ్రీనేత్రాలయ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హనుమాన్‌నగర్‌లో ఉచిత కంటి పరీక్ష శిబిరం జరిగింది. శిబిరాన్ని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్ ప్రారంభించారు. నేత్ర వైద్యులు చైతన్యారెడ్డి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొంద్ర స్టాలిన్‌గౌడ్, రాజేందర్, రమణారెడ్డి, సంజీవరెడ్డి, కొంద్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

జ్యోతినగర్ : హిందీ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులకు హిందీ రాత(డ్రాఫ్టింగ్), నోటింగ్ పరీక్ష నిర్వహించారు.కార్యక్రమానికి ఎన్టీపీసీ జీఎం (మెయింటనెన్స్) సంపత్‌కుమార్ రాము హాజరై పోటీలను ప్రారంభించారు. 30 మంది పోటీల్లో పాల్గొనగా, విజేతలకు పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి భారతి-శంకర్‌ల కుమార్తె ఆనంది ఈనెల 18న హైదరాబాద్‌లోని ఓయూలో జరిగిన పరుగుపందెం పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు గోల్డ్‌మెడల్ అందుకుంది.

కమాన్‌పూర్ : డీపీవో వీరబుచ్చయ్య సూచన మేరకు మండలంలోని గుండారం, సిద్దిపల్లె, జంజర్ల, జూలపల్లి, కమాన్‌పూర్, పెంచికల్‌పేట, నాగారం, రొంపికుంట, పేరపల్లి గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటుచేశారు. అధికారి వచ్చినప్పుడు లేదా గ్రామ సభలు జరిగినప్పుడు టీ తాగడానికి కప్పులు, గ్లాసులు, ప్లేటు, చెంచాలు వంటి ప్లాస్టిక్ వస్తువులు వాడడానికి బదులు స్టీల్ బ్యాంకుల్లోని వస్తువులను వాడాలని సూచించారు.

ఓటర్ జాబితా రూపకల్పనలో సహకరించాలి : ఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో గంగయ్య


ముత్తారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో


పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీడీవో శశికళ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 19 : గ్రామీణ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సంపూర్ణ సహకారం అందజేయాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, ఈ సందర్భంగా 13న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి ప్రదర్శించినట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోగల అభ్యంతరాలు, నూతన ఓటరు నమోదు దరఖాస్తులను సెప్టెంబరు 21లోపు సంబంధిత మండలాల ఎంపీడీవోలకు లిఖిత పూర్వకంగా సమర్పించాలని, సెప్టెంబరు 26 లోపు అభ్యంతరాలను పరిష్కరించి, సెప్టెంబరు 28న తుది జాబితా విడుదల అవుతుందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో గనుకోట శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముత్తారం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ జాబితాను సవరించుకునేందుకు ఆయా పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమం గురువారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ఓటర్ల జాబితాను సవరించుకునేందుకు ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆయా పార్టీ నాయకులను కోరారు. ఓటర్ నమోదు తప్పుగా జరిగిన వార్డులు తప్పుగా ప్రచురితమైన సవరించుకోవాల్సిన సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు బిరుదు గట్టయ్యలు పాల్గొన్నారు.

పాలకుర్తి : పాలకుర్తి ఎంపీడీవో పొల్సాని శశికళ అధ్యక్షతన గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆల్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, బీఎస్పీ నుంచి నల్లిగంటి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి : రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల ఓటరు ముసాయిదాపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మజ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల ఓటరు ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి, పలువురు రాజకీయపార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా వార్డుల వారిగా ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఎంపీడీవో లలిత, తహసీల్దార్ వాసంతి, ఎంపీవో కాటం భాస్కర్‌లు మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21లోపు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైనాల రాజు, బీజేపీ శాఖ అధ్యక్షుడు జంగేపల్లి అజయ్, సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, నల్లవెల్లి శంకర్, నాయకులు మచ్చగిరి రాము, రంగు సత్యనారాయణగౌడ్, కొంతం శ్రీనివాస్, మల్లారం అరుణ్, అనవేణ వేణు, వెంగళ రాజయ్య, మాదాసు విజయ్ తదితరులు ఉన్నారు.

సంచలనం రేపుతున్న అక్రమ వసూళ్ల దందా

- పది రోజుల్లో మూడు కేసులు నమోదు.. - పోలీసులను ఆశ్రయించేందుకు మరికొందరు బాధితుల ప్రయత్నాలు

మంథని, సెప్టెంబరు 19: మంథని ప్రాంతంలో ఇద్దరు వ్యక్తుల అక్రమ వసూళ్ల దందా సంచలనం రేపుతోంది. అధికారపార్టీ నేతతో పాటు పాత్రికేయుడి ముసుగులో బెదిరింపులు, అక్రమవసూళ్ల పాల్పడిన వ్యక్తి చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తోంది. డివిజన్‌లో బెదిరింపులకు పాల్పడి అక్రమంగా లక్షలాది రూపాయల వసూళ్ల ఆరోపణలపై మంథని మాజీ ఉపసర్పంచ్, అధికార కాంగ్రెస్ పార్టీ నేత ఇనుముల సత్యనారాయణ(సతీష్), ఓ ఛానల్ రిపోర్టర్‌గా చేస్తున్న రావికంటి సతీష్‌లపై కేసుల పరంపర కొనసాగుతున్నాయి. తాజాగా బుధవారం ఇనుముల సతీష్, రావికంటి సతీష్‌పై మంథనిలో పోలీసు స్టేషన్‌లో అక్రమ వసూళ్ల ఆరోపణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ వెల్లడించారు. వారం క్రితం రామగిరి పోలీసు స్టేషన్‌లో ఇనుముల సతీష్, రావికంటి సతీష్‌లపై, పదిరోజుల క్రితం మంథని పోలీసు స్టేషన్‌లో ఇనుమల సతీష్‌పై కేసులు నమోదు కావడం రాజకీయంగా, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు నమోదైన మూడు కేసుల్లో వారిద్దరిపై బెదిరింపులు, అక్రమంగా లక్షలాది రూపాయల వసూళ్ల ఆరోపణలు ఉన్నాయి. మంథనికి చెందిన మండల మల్లారెడ్డి తన ఇంటి నిర్మాణం విషయంలో ఇనుముల సతీష్ మున్సిపల్ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేసి రూ.5లక్షలు ఇవ్వాలని లేనిపక్షంలో నిర్మాణాన్ని అడ్డుకుంటానని బెదిరించగా రూ.2లక్షలు ఇచ్చానని, మగతా 3లక్షల కోసం గన్‌మెన్‌ను అడ్డుపెట్టుకొని బెదిరించడాని ఆరోపిస్తూ మంథని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ వెల్లడించారు. రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామశివారులో రియల్ ఎస్టేట్‌లో భూముల అమ్మకాల విషయంలో గన్‌మెన్ తమ వద్దకు వచ్చి బెదిరించి రూ.20లక్షలు ఇవ్వకపోతే, భూముల విక్రయాల రిజిస్ట్రేషన్లు చేస్తే చంపుతానని బెదిరించగా మంథనికి చెందిన రావికంటి సతీష్ మధ్యవర్తిత్వం వహించి రూ.10 లక్షలకు డీల్ సెటిల్ చేయగా రూ.10లక్షలు రావికంటి సతీష్‌కు అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేశామని, ఇంకా డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపిస్తూ వారిద్దరిపై రామగిరి పోలీసు స్టేషన్‌లో బాధితుడు సైండ్ల తిరుపతి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు. తాజాగా మంథని పట్టణ శివారులోని బీఎస్ బాంక్వెట్ హాల్ నిర్మాణం చేసుకున్న బిరుదు శ్రీను అనే వ్యక్తిని మంథనికి చెందిన ఇనుముల సత్యనారాయణ తన గన్‌మెన్‌తో వచ్చి రూ.10లక్షలు ఇవ్వాలని, లేనిఎడల ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటానని బెదిరించిన కేసులో ఇనుముల సత్యనారాయణతోపాటు అతనికి సహకరిస్తున్న రావికంటి సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు మంథని ఎస్ఐ రమేష్ తెలిపారు. బిరుదు శ్రీనివాస్ అనే వ్యక్తి తన ఉన్న ఇంటిస్థలంలో బాంక్వెట్ హాల్ నిర్మాణం చేపట్టగా సత్యనారాయణ డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో శ్రీనివాస్ వద్దకు రావికంటిసతీష్ వెళ్లి మధ్యవర్తితనం చేసి మాట్లాడాడు. శ్రీనివాస్ తన స్నేహితుడి అకౌంట్ ద్వారా రూ.5లక్షలకు టాన్స్‌ఫర్ చేశాడని, మిగతా రూ.5లక్షల కోసం తరచూ బెదిరింపులకు పాల్పడటంతో గతనెల 20వ తేదీన సతీష్, గన్‌మెన్, రావికంటి సతీష్‌తో కలిసి బాంక్వెట్ హాల్ వద్దకు వెళ్లి మిగతా రూ.5లక్షలు ఇవ్వకపోతే కోర్టులో పిల్ వేసి కూల్చివేయిస్తానని శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. మరికొందరు బాధితులు సైతం పోలీసులను ఆశ్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జగుతోంది.

కాగా, ఇంకా ఎవరైనా ఇనుముల సతీష్, రావికంటి సతీష్‌ల బాధితులు ఉంటే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మంథని ఎస్ఐ రమేష్ సూచించారు.

పెద్దపల్లి నైట్‌హాల్ట్ బస్సు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 19: కాల్వశ్రీరాంపూర్‌లో పెద్దపెల్లి నైట్‌హాల్ట్ బస్ ప్రారంభమైనట్లు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ తెలిపారు. గతంలో పెద్దపెల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ నైట్‌హాల్ట్ బస్సు ఉండేది. కొన్ని సంవత్సరాలుగా గోదావరిఖని డిపోకు చెందిన బస్సు కాల్వ శ్రీరాంపూర్‌లో రాత్రి వచ్చి ఉదయాన్నే వెళ్లిపోయేది. దీంతో కూనారం, మంగపేట, వెన్నంపల్లి, పెద్దపల్లి మండలంలోని పలు గ్రామాల ప్రజలు పెద్దపెల్లికి భాగ్యనగర్ ట్రైన్‌కు వెళ్లేందుకు ఏ వాహనాలు లేక పోవడంతో నానా ఇబ్బందులు పడ్డారు. కాల్వశ్రీరాంపూర్‌కు రాత్రి 9గంటలకు వచ్చి ఉదయం నాలుగున్నరకే పెద్దపెల్లికి ఆర్టీసీ బస్సు ఉండేది. అదేవిధంగా నైట్‌హాల్ట్ బస్సు లేని కారణంగా పెద్దపెల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్ వరకు ఉన్న గ్రామాల ప్రయాణికులు రాత్రిపూట బస్సు లేని కారణంగా అనేక అవస్థలు పడ్డారు.

కాగా, నైట్‌హాల్ట్ బస్సు నిలిచిపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు గమనించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆర్‌టీసీ గోదావరిఖని డిపో అధికారులతో మాట్లాడి నైట్‌హాల్ట్ బస్సు పునరుద్ధరించినట్టు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ తెలిపారు.

నైట్ హాల్ట్ బస్సును పునఃప్రారంభించినందుకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్‌లకు మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రామగుండంలో టీయూఎఫ్ఐడీసీ పనులు షురూ..

కోల్‌సిటీ, సెప్టెంబరు 19: రామగుండం నగరపాలక సంస్థలో టీయూఎఫ్ఐడీసీలో మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు రూ.30కోట్లు కేటాయించారు. మొదట లైటింగ్, మంచినీటి పైప్ లైన్ల పనులు జరుగనున్నాయి.ప్రస్తుతం ఉన్న సెం ట్రల్ లైటింగ్ స్థానంలో ఇరువైపులా బటర్ ఫ్లై లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అండర్‌గ్రౌండ్ నుంచి కేబుల్స్ వేయనున్నారు. ఈ పనుల తరువాత అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, నిర్మిస్తారు.

నోరు తెరిచిన మ్యాన్ హోల్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 19: రామగుండం కార్పొరేషన్ 42వ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లోని మార్వాడీ స్ట్రీట్‌లో పది రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత పగిలిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోడం లేదు. నిత్యం భారీ వాహనాలు వచ్చి వెళుతుండడంతో మ్యాన్ హోల్ పగిలిపోయి రోడ్డుపై డ్రైనేజీ నీరు ప్రవహిస్తోంది. ఈమార్గంలో నిత్యం చిన్నపిల్లలు స్కూల్‌కు వెళుతున్నారు. ప్రమాదకరంగా మారడంతో స్థానంలో అందులో పడి ప్రమాదానికి గురికాకుండా తాత్కాలికంగా ఎర్ర కవర్ కట్టారు.

స్వశక్తి మహిళలకు కోడి పిల్లల పంపిణీ

ఓదెల, సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఇందిరా మహిళాశక్తిలో భాగంగా మహిళలకు పెరటి కోళ్ల పిల్లలను పంపిణీ చేశారు. బ్యాంకు లింకేజీ శ్రీనిధి రుణం గ్రామ సంఘం నుంచి అప్పుల ద్వారా కోళ్ల అభివృద్ధికి మహిళలకు కోడి పిల్లలను అందజేసినట్లు ఏపీఎం లతా మంగేశ్వరి తెలిపారు. జీలకుంటకు చెందిన చర్లపల్లి కవితకు మదర్ యూనిట్ కింద వెయ్యి కోడి పిల్లలను అందజేశారు. కార్యక్రమంలో సీసీలు మారెళ్ల శ్రీనివాస్, మల్లయ్య, కొమురయ్య, విజయ, రాజకుమారి, అకౌంటెంట్ భవాని, ఆపరేటర్ పవన్ కుమార్, వీవోఏలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న హెచ్ఈవో లక్ష్మణ్

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 19: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్ఈఓ లక్ష్మణ్ అన్నారు. మండలంలోని వెన్నంపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు హెచ్ఈఓ లక్ష్మణ్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. చదువుపైనే ప్రత్యేక దృష్టి సారించి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు, కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, ఉపాధ్యాయులు రాజేశ్వర్, ప్రసాద్, ఆశాలు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ఎలిగేడు, సెప్టెంబరు19: ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశం పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహిస్తామని ముఖ్య కార్యనిర్వహణ అధికారి కేశెట్టి విక్రమ్ తెలిపారు. చీమలపేట గ్రామంలో నూతనంగా గోదాం నిర్మాణం, ఆడిట్ సర్టిఫికెట్ ఆమోదం, 6నెలల్లో జమ ఖర్చులు ఆమోదం, తేలుకుంటలో కొనుగోలు చేసిన పాత గృహం మరమ్మతు, ప్రహరీ గోడ నిర్మాణం, అంచనా బడ్జెట్ ఆమోదం తదితర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథిగా రానున్నారని, పీఏసీఎస్ జిల్లా జిల్లా అధికారులు, ప్రస్తుత పాలక వర్గం సభ్యులు హాజరు అవుతున్నారని తెలిపారు. దీర్ఘ, స్వల్ప కాలిక రుణాలు పొందిన రైతులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ఎలిగేడు, సెప్టెంబరు 19: ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నాలుగు మండలాలైన ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్‌ల నుంచి ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న 52మంది ఉపాధ్యాయులకు అభ్యసన సామర్థ్యాలపై శిక్షణ ఇచ్చారు. 6నుంచి 9వ తరగతి వరకు ఈ సంవత్సరం అభ్యాసన, అభివృద్ధి కార్యక్రమంలో వచ్చిన మార్పులు, నాన్ ఎగ్జామ్ గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మండల నోడల్ ఆఫీసర్ అనసూరి నరేంద్రచారి మాట్లాడుతూ అభ్యాసన సామార్థ్యాలను విద్యార్థుల్లో పెంపొందిస్తూ దానికి అనుగుణంగా బోధన జరపాలని కోరారు. కాంప్లెక్స్ హెచ్ఎం గంద్ర దేవేందర్‌రావు, రిసోర్స్‌పర్సన్స్ నరసింహరామశర్మ, స్వామి, రాజమల్లు, సిఆర్‌పి లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

తెరుచుకోని అంగన్‌వాడీ సెంటర్లు


తెరుచుకోని ఎలిగేడు-2 అంగన్‌వాడీ కేంద్రం

ఎలిగేడు, సెప్టెంబరు 19: ఎలిగేడు మండలంలోని శివపల్లి-1, ఎలిగేడు-2 అంగన్‌వాడీ సెంటర్లు గురువారం తాళాలకే పరిమితం అయ్యాయి. శివపల్లి సెంటర్‌లో పసిపిల్లల తల్లులు స్వయానా వండుకొని పిల్లలకు సెంటర్ పక్కన ఉన్న బొమ్మలు, ఆటవస్తువులను చూపిస్తూ తినిపిస్తున్నారు. మండలంలోని 12గ్రామాల్లో రెండు, మూడు సెంటర్లు మినహా మిగతా వాటిలో పిల్లలు లేరనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణను మెరుగుపర్చాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

పీడీఎస్‌యూ సభను విజయవంతం చేయండి

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 19: ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేయడం ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడి కుమార్, ముల్కల మారుతి అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పవన్, రాజేష్ ,యశ్వంత్, మణిదీప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానికులకే ఓటు హక్కు కల్పించాలి'

ఓదెల, సెప్టెంబరు 19: రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో స్థానికంగా నివాసం ఉన్న వారికే ఓటు హక్కును కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గోసిక రాజేశం, మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య గురువారం ఎంపీడీవో తిరుపతికి వినతిపత్రం అందజేశారు. అలాగే ఒకేచోట ఓటును వినియోగించుకునే విధంగా హక్కును కల్పించాలని కోరారు. స్వగ్రామానికి చెందిన వారు ఇతర ప్రాంతాల్లో జీవనోపాధి కోసం వెళ్ళిన వారు అక్కడే ఓట్లను వినియోగించుకోవాలన్నారు. గతంలో నిర్వహించిన జీపీ ఎన్నికల్లో ఇతర ప్రాంతాలలో నివాసం ఉండేవారు సైతం మండలంలోని స్వగ్రామంలో ఓట్లను వినియోగించుకోవడం వల్ల అవకతవకలు జరిగాయని రాజేశం తెలిపారు. ఇప్పుడు అలా కాకుండా మండలంలోని గ్రామాలకు చెందిన వారు నివాసం ఉండే గ్రామాల్లోనే ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఇప్పటినుంచి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 19: కాల్వశ్రీరాంపూర్‌లో గురువారం మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి తదితరులు తహసీల్దార్ ఎండీ వకీల్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆడెపు శ్రీదేవి రాజు, గోనే శ్యామ్, బుర్ర మంగసదానందం, కాసం శ్రీనివాస్‌రెడ్డి, కొనకటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొల్లూరి రమాదేవి రాజమల్లు, కదురు మానస సతీష్, మాజీ ఉప సర్పంచ్ సుదాటి కరుణాకర్‌రావు ఉన్నారు.

'మున్సిపల్ కమిషనర్‌ను నియమించండి'

సుల్తానాబాద్, సెప్టెంబరు19: సుల్తానాబాద్ మున్సిపాలిటీలో కొన్ని రోజులుగా కమిషనర్ లేకపోవడం వల్ల ప్రజలకు కావలిసిన సర్టిఫికెట్లు నిలిచిపోయాయని, వెంటనే కమిషనర్‌ను నియమించాలని బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫిక్ అధికారులకు విన్నవించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలు ప్రజావాణిలో ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేస్తే అది కలెక్టర్ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయానికి పంపిస్తారన్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో కమిషనర్ లేని కారణంగా అట్టి సమస్యలు పరిష్కారం జరగడం లేదన్నారు. ఇకనైనా కమిషనర్‌ను త్వరగా నియమించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.



వరద బాధితుల సహాయ నిధికి కార్మికుల జీతం

- రూ.10.25కోట్ల చెక్కును సీఎంకు అందజేసిన యాజమాన్యం


సీఎం, ఉపముఖ్యమంత్రికి చెక్కును అందజేస్తున్న సీఎండీ, నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 19: రాష్ట్రంలో గత 15రోజుల క్రితం జరిగిన వరద బీభత్సానికి నష్టపోయిన ప్రాంత ప్రజల సహాయం కోసం సింగరేణి కార్మికులు ఉదారత చాటుకున్నారు. తమ ఒక్క రోజు మూల వేతనం రూ.10,25,65,273 ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. ఈ మేరకు గురువారం సింగరేణి సీఎండీ బలరాంతో పాటు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీఎండీ బలరాం నాయక్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు, ఏఐటీయూసీ అధ్యక్షకార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో అన్ని వసతులు కల్పిస్తాం : ఆర్జీ-1 జీఎం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 19: ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో త్వరలోనే అన్ని వసతులు కల్పిస్తామని సింగరేణి ఆర్‌జీ-1 జనరల్‌మేనేజర్ లలిత్‌కుమార్ హామీ ఇచ్చారు. గురువారం గోదావరిఖనిలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. పాఠకులను కలిసి సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం లలిత్‌కుమార్ మాట్లాడుతూ ఆర్‌జీ-1లో ఉన్న ఈ శాఖా గ్రంథాలయంలో పాఠకులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కాబట్టి సింగరేణి, సింగరేణేతర విద్యార్థులు, యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్‌రెడ్డి, లైబ్రేరియన్ భారతి, పాఠకులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాల ఎదుట టీబీజీకేఎస్ ధర్నా


ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు


ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

గోదావరిఖని, సెప్టెంబరు 19: సింగరేణి కార్మికులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన వాస్తవ లాభాలు ప్రకటించాలని, ఆ లాభాల్లో 35 శాతం వాటాను కార్మికవర్గానికి చెల్లించే తేదీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) గురువారం సింగరేణిలోని 11 జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించింది. ఇందులో భాగంగా ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ముందు కూడా టీబీజీకేఎస్ ధర్నా చేసింది. ఈ ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఆర్థిక సంవత్సరం 70మిలియన్ టన్నుల బొగ్గును రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేసిందని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు కావస్తున్నా వాస్తవ లాభాలను ప్రకటించడంలో యాజమాన్యం వైఫల్యం చెందిందని రాజిరెడ్డి ఆరోపించారు. లాభాల్లో వెంటనే 35 శాతం కార్మికులకు వాటా ఆయన ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గతానికి భిన్నంగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు లాభాలు ప్రకటించకపోవడం పట్ల కార్మికవర్గం అయోమయానికి గురవుతున్నదని ఆయన అన్నారు. ఎప్పటిలాగే దసరా పండుగకు కార్మికులకు లాభాల వాటా అందేలా చర్యలు తీసుకోవాలని రాజిరెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో కొత్తగూడెం, హైదరాబాద్ సింగరేణి భవన్‌ల ముందు ఆందోళనలు చేపట్టడానికి కూడా వెనుకాడమని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి డిమాండ్లను వివరించారు. ఈ ధర్నాలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసు మారమూర్తి, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, ఎల్ వెంకటేష్, చల్లా రవీందర్‌రెడ్డి, పొలాడి శ్రీనివాసరావు, దూట శేషగిరి, సీహెచ్ శ్రీనివాస్, ఎం రాజేశం, వాసర్ల జోసఫ్, ఉప్పులేటి తిరుపతి, లక్ష్మణ్, జనగామ మల్లేష్, అంజయ్య, పులిపాక శంకర్, బొగ్గుల సాయి, రొడ్డ సంపత్, రమహమాన్, వెంకటరెడ్డి, సురేందర్, సుధాకర్, అభిషేక్, వెంకటస్వామి, భాస్కర్, రాజు, గడ్డి శ్రీను, బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, మారుతి, బొడ్డు రవీందర్, కవిత సరోజిని, గాదం విజయ, సంధ్య, గుంపుల లక్ష్మి, తోకల రమేష్, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : లాభాల వాటా చెల్లింపులో సింగరేణి యాజమాన్యం అలసత్వాన్ని నిరసిస్తూ గురువారం టీబీజీకేఎస్ శ్రేణులు ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేశాయి. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడారు. ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు మాదాసు రామ్మూర్తి, ప్రభాకర్‌రెడ్డి, ఐ సత్యం, బేతి చంద్రయ్య, శ్రీనివాసరెడ్డి, అనిల్‌రెడ్డి, హమీద్, సురేందర్, హరిప్రసాద్, జాడి వెంకటి, రవితేజ, కూర తిరుపతి పాల్గొన్నారు.

రామగిరి : సింగరేణి సంస్థ ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట గురువారం టీబీజీకేఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలోని కార్మికుల లాభాల వాటాను తక్షణం చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌పై జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి పర్సనల్ మేనేజర్ సుదర్శనంకు వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగెల్లి సాంబయ్య, పింగిళి సంపత్‌రెడ్డి, దేవశ్రీనివాస్, కేశవరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, పూలేటి రమేశ్, వివిగౌడ్, గట్టు శీను, వేముల రవిశంకర్, శ్రీనివాస్, మల్లేష్, తిరుపతి, అశోక్, సందీప్, సదానందం, రవీందర్, సారయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్జీ-3లో వినతిపత్రం అందిస్తున్న టీబీజీకేఎస్ శ్రేణులు